క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణాల పరిశీలన



జగనన్న లేఅవుట్‌లో లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారులు

రొద్దం: వైఎస్సార్ జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణం చేపడుతున్న లబ్ధిదారులు జగనన్నకు చెబుదాం 1902కు ఫోన్ చేయడంతో అధికారులు సమస్యపై ఆరాతీశారు. మంగళవారం ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. సమస్యపై లబ్ధిదారులతో చర్చించారు. నిర్మాణం చేపడుతున్న లబ్ధిదారులకు త్వరలోనే బిల్లులు మంజూరు అవుతాయన్నారు. ఇప్పటికే కొందరు లబ్ధిదారులకు బిల్లులు పడినట్లు వివరించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ ఖాజామైనుద్దీన్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సోని తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఏఆర్ రొప్పం సచివాలయం పరిధిలోని ఎగువ రామగిరి గ్రామంలో బుధవారం ఉదయం 7 గంటల నుంచి ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ కవిత, సర్పంచ్ గీత తెలిపారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, వలంటీర్లు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

పనులు వేగవంతం చేయండి



నాడు - నేడు పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రఘునాథగుప్తా

గోరంట్ల: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో నాడు- నేడు కింద చేపడుతున్న పనులను మంగళవారం ఎంపీడీఓ రఘునాథగుప్తా పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలను పాటించడంతో పాటు పనులను వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం స్థానిక విద్యావనరుల కార్యాలయంలో జగనన్న విద్యా కానుకలో భాగంగా వచ్చిన పాఠ్య పుస్తకాలు, దుస్తుల మెటీరియల్‌ను పరిశీలించారు.

ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రం ఏర్పాటు



ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యాధికారి షంషూ

పావగడ: స్వచ్ఛ భారత్ మిషన్ పరిధిలో 'నా లైఫ్- నా స్వచ్ఛ నగరం' ప్రాజెక్ట్‌లో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆర్‌ఆర్‌ఆర్ (రెడ్యూస్, రీ యూస్, రీ సైకిల్) కేంద్రాన్ని మున్సిపల్ ముఖ్యాధికారి షంషూ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పట్టణంలోని శిరా రోడ్డు సంత మైదానంలో ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రం, ఆర్‌ఆర్‌ఆర్ మొబైల్ ట్రాక్టర్ ఏర్పాటు చేశామన్నారు. పట్టణవాసులు తమ వద్ద ఉన్న ఆట వస్తువులు, పాత గుడ్డలు, జీన్స్, చీరలు, దిన,వార పత్రికలు, పాత పుస్తకాలు, ప్లాస్టిక్ సంచులు, పాల కవర్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాలకు అందజేయాలన్నారు. వాటికి బదులుగా మున్సిపల్ కార్యాలయం నుంచి స్టేషనరీ వస్తువులు, ప్రతి 250 గ్రాముల ప్లాస్టిక్ సంచులకు ఒక గుడ్డ సంచి ఇస్తామన్నారు. అలాగే డిజిటల్ ప్రమాణ పత్రాలు అందిస్తామన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

గోరంట్ల: మండల పరిధిలోని కరావులపల్లిలో దాతలు, గ్రామస్తుల సహకారంతో నిర్మిస్తున్న కరావులీశ్వర ఆలయ నిర్మాణానికి ఎంపీపీ ప్రమీల, నరసింహామూర్తి దంపతులు రూ.25 వేల విరాళం ప్రకటించారు. మంగళవారం ఆ మొత్తాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

ఘనంగా జ్యోతుల ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో అమ్మవార్లు

మడకశిరరూరల్: మండల పరిధిలోని భీమరాయనపల్లిలో మంగళవారం వైభవంగా కనుమ మారెమ్మ, కొల్లాపురమ్మ అమ్మవార్లకు మహిళలు జ్యోతుల ఉత్సవాలు నిర్వహించారు. కనుమ మారెమ్మను ఊరేగింపుగా తీసుకొచ్చి గ్రామ మధ్యలో కుర్చోబెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి జ్యోతులను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు నారాయణస్వామి ఇంటిలో విందు భోజనం స్వీకరించారు.



మడకశిర రూరల్: హరేసముద్రం దగ్గరున్న బావిలో ఈత కొడుతున్న యువకులు



అమరాపురం: నీటిలో డై కొడుతున్న యువకుడు

స్విమ్మింగ్ కూల్

భానుడి భగ భగకు జనం అల్లాడిపోతున్నారు. ఎండ వేడిమి భరించలేక చాలా మంది యువకులు, విద్యార్థులు నీటి కొలనులు, వ్యవసాయ బావులు, స్విమ్మింగ్ పూల్‌లను ఆశ్రయిస్తున్నారు. నీటిలోనే ఎక్కువ సేపు గడుపుతూ ఎండవేడిమి నుంచి ఉపశమనం పొందుతున్నారు.

– మడకశిర రూరల్/అమరాపురం



అమరాపురం: నీటి కొలనులో ఇలా...

దాహం.. దాహం..



మడకశిరరూరల్: ఎండవేడిమికి ప్రజలతో పాటు జంతువులు కూడా ఇబ్బంది పడుతున్నాయి. మరీ ముఖ్యంగా నీటి కోసం జంతువులు తెగ ఆరాటపడుతున్నాయి. మడకశిర పట్టణంలో ఓ షాపు వద్ద వదిలి వెళ్లిన వాటర్ బాటిల్‌ను ఎంచక్కా ఓ వానరం చేతిలోకి తీసుకొని దాహం తీర్చుకుంది.



ఉష్ణోగ్రత సమాచారం

(గరిష్ఠం)

హిందూపురం	37.0
పెనుకొండ	40.0
మడకశిర	37.0

వచ్చే ఎన్నికలకు సిద్ధంకండి

పావగడ: 'స్థానిక విధాన సభ క్షేత్రం ఎన్నికల్లో జేడీఎస్ పార్టీ తప్పక గెలుస్తుందనుకున్నాం.. అయితే అతి తక్కువ ఓట్ల తేడాతో ఓడిపోయాం' అని మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప ఒక ప్రకటనలో తెలిపారు. ఓడిపోయామని అధైర్య పడొద్దని కార్యకర్తలకు సూచించారు. తనకు ఓటు వేసిన 71 వేల మంది ఓటర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే జెడ్పీ, టీపీ, స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు.

'ఇంటర్'కు దరఖాస్తుల ఆహ్వానం

అమరాపురం: మండలంలోని హలుకూరు గ్రామ సమీపంలో ఉన్న ఆదర్శ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఓబుళపతి తెలిపారు. జూన్ 7వ తేదీ వరకు గడువు ఉందన్నారు. మెరిట్ ప్రకారం సీట్లను ఇస్తామన్నారు.

వలంటీర్లు సంక్షేమ వారధులు



వలంటీర్లకు సేవా పురస్కారాలు అందించిన ఎమ్మెల్యే శంకరనారాయణ

• ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ

పెనుకొండ: సంక్షేమ సారథులు వలంటీర్లు అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పేర్కొన్నారు,. పట్టణంలోని ఎంపీడీఓ సమావేశపు భవనంలో మంగళవారం వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా ఆదిలక్ష్మమ్మ అనే వలంటీర్‌కు సేవా వజ్ర , మరో నలుగురికి సేవా రత్న, మిగిలిన వలంటీర్లకు సేవామిత్ర పురస్కారాలను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకరనారాయణ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందించడంలో వలంటీర్లు ఎంతో కీలకంగా వ్యవహరిస్తున్నారన్నారు. కుల, మత, రాజకీయంతో సంబంధం లేకుండా అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు చేరుతున్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2.66 లక్షల మంది వలంటీర్లు ఒక మహాసైన్యంలా పేదలకు సేవలు చేస్తున్నారని పేర్కొన్నారు. వారి సేవలను గుర్తించే వరుసగా మూడో ఏడాది కూడా వలంటీర్లకు సేవా పురస్కారాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే వలంటీర్లతో పాటు సచివాలయ వ్యవస్థను రద్దు చేయడం ఖాయమన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ప్రజలతో వలంటీర్లు మమేకం అవుతూ ప్రజలకు జగనన్న చేసిన మంచిని నిరంతరం వివరించాలన్నారు. పచ్చ పత్రికలు చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని కుట్రపూరిత కథనాలు ప్రచురిస్తున్నాయని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు వలంటీర్లు చురుగ్గా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో ఎంపీపీ గీత, ముఖ్య నాయకులు రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాగలూరు బాబు. గృహసారథుల కన్వీనర్ శ్యామ్‌నాయక్, మాజీ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు కృష్ణారెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు శ్రీనివాసులు, కొండలరాయుడు, నగర కార్పొరేషన్ డైరెక్టర్ నరసింహప్ప, నారాయణస్వామి, వైస్ ఎంపీపీ రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ఎజెండా

• ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్



హిందూపురం: పాదయాత్రలో ప్రజల కష్టాలు కళ్లారా చూసి దానికి అనుగుణంగా ఎన్నికల హామీలను ఇచ్చి అధికారం చేపట్టిన తర్వాత హామీలన్నీ నెరవేరుస్తున్న ఒకే ఒక్క ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ కొనియాడారు. మంగళవారం ఆయన ఎమ్మెల్సీ క్యాంప్ ఆఫీసులో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనకు నేటితో నాలుగేళ్లు పూర్తయ్యాయన్నారు. సీఎం వైఎస్ జగన్ అభివృద్ధి, సంక్షేమాలను రెండు కళ్లుగా ప్రజలకు మంచి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగిపోతున్నారని తెలిపారు. ప్రజలకు చేస్తున్న మంచిని జీర్ణించుకోలేని టీడీపీ, జనసేన ఇతర పార్టీలతో పాటు ఎల్లోమీడియా అబద్ధాలతో మభ్యపెట్టి మాటలతో ప్రజల మనస్సులో విష బీజాలు నాటడానికి ఎన్నోరకాలుగా ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ఎవరెన్ని చెప్పినా ప్రజలు మాత్రం జననేత జగన్ మోహన్‌రెడ్డిని తమ గుండెల్లో నిలుపుకున్నారని చెప్పారు. కరోనా కష్టకాలంలో మిగతా రాష్ట్రాల్లోని ప్రజాప్రతినిధులు, అధికారులు చేతులెత్తేసినా.. ఏపీలో మాత్రం సీఎం జగన్.. ప్రజల ప్రాణాలు కాపాడేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టారన్నారు. ఆ సమయంలో ప్రతిపక్ష పార్టీలు, నాయకులు ఒక్కరైనా ప్రజల మధ్యకు వచ్చారా? అని ప్రశ్నించారు. నేనున్నానంటూ సీఎం జగన్, ఆయన సైన్యం ప్రజలకు సేవలందించారని స్పష్టం చేశారు. విద్యా విధానంలో సమూల మార్పులు తెచ్చి నాడు నేడు కార్యక్రమంతో పూర్వవైభవం తెచ్చారన్నారు. ప్రతిగ్రామంలో విలేజ్ క్లినిక్‌లు నిర్మించి ప్రజలకు వైద్యసేవలు చేరువ చేశారన్నారు. వార్డు, గ్రామ సచివాలయాలతో ప్రతి సమస్యను పరిష్కరించేందుకు ఇంటి ముంగిటకే పాలన తెచ్చారన్నారు. రైతులకు అండగా ఆర్‌బీకే సెంటర్లు ఏర్పాటు చేసి వ్యవసాయం పండుగ చేశారన్నారు. టీడీపీ పాలనలో మహిళలను నిలువునా అప్పుల్లో ముంచేసినా జగనన్న సోదరుడిగా వారికి అండగా నిలిచి వైఎస్సార్ చేయూత, ఆసరా, పావులా వడ్డీతో మహిళలను లక్షాధికారులను చేశారన్నారు. 31 లక్షల మందికి ఇంటి పట్టాలు, ఇళ్లు మంజూరు చేసి జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించి కాలనీలు కాకుండా ఊర్లే నిర్మించారని చెప్పారు. రానున్న ఎన్నికల్లోనూ వైఎస్ జగన్‌ని మరోసారి ముఖ్యమంత్రిగా దీవించాలని కోరారు.

టీడీపీ నేతపై చర్యలు తీసుకోండి



ఎస్‌ఐ మునిప్రతాప్‌కు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుడిబండ: టీడీపీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్‌కు ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామిని విమర్శించే స్థాయి లేదని జెడ్పీటీసీ సభ్యుడు భూతరాజు, సింగల్‌విండో అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. ఎమ్మెల్యేపై వ్యక్తిగత ఆరోపణలు చేసిన మంజునాథ్‌పై చర్యలు తీసుకోవాలని మంగళవారం స్థానిక పోలీస్టేషన్‌లో ఎస్‌ఐ మునిప్రతాప్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ కె.శివకుమార్, మండల ఎస్సీ సెల్ కన్వీనర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు సన్మానం



వలంటీర్లను సన్మానించిన దృశ్యం

హిందూపురం: 'వలంటీర్లకు వందనం' కార్యక్రమంలో భాగంగా మంగళవారం చౌడేశ్వరీకాలనీలోని 1, 2 సచివాలయాల్లోని వలంటీర్లకు సేవా మిత్ర పురస్కర కార్యక్రమం నిర్వహించారు. వలంటీర్లను సత్కరించి సేవామిత్ర సర్టిఫికెట్లు అందించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో 2వ వార్డు సచివాలయ కార్యదర్శులు, ఆయా వార్డుల వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'వలంటీర్లకు వందనం'

రొళ్ల: మండల కేంద్రం లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఆవరణలో బుధవారం ఉదయం 10.30 గంటలకు వలంటీర్లకు పురస్కారలను ప్రదానం చేయనున్నట్లు ఎంపీడీఓ రామారావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే తిప్పేస్వామి ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. సచివాలయ సిబ్బంది, మండలస్థాయి అధికారులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

హిందూపురం టౌన్: పట్టణంలోని ఆర్‌కే ఫంక్షన్ హాలులో బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు 'వలంటీర్లకు వందనం ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరేంద్ర పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ హాజరవుతారన్నారు.

అణ్ణెమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అణ్ణెమ్మ అమ్మవారు

లేపాక్షి: బెంగళూరు నగరంలో వెలసిన అణ్ణెమ్మ దేవతకు చోళసముద్రంలో గ్రామస్తులు మంగళవారం ఉదయం ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అణ్ణెమ్మ దేవతను ఉత్సవ విగ్రహాన్ని మొదటిసారి చోళసముద్రానికి తీసుకువచ్చారు. ఇందులో భాగంగానే ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం నిర్వహించారు.

ఆధార్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోండి

అమరాపురం: మండలంలోని వివిధ గ్రామ సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్న ఆధార్ నమోదు మొబైల్ క్యాంపును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మునిస్వామి తెలిపారు. బుధవారం మండలంలోని హేమావతి సచివాలయం -2, హలుకూరు -1, 2, 25న గురువారం ఆలదపల్లి, బసవనపల్లి, కె.శివరం, 30న మంగళవారం మద్దనకుంట, తమ్మడేపల్లి, 1, 2, 31న బుధవారం అమరాపురం 1, 2, నిడ్రగట్ట గ్రామ సచివాయాల్లో మొబైల్ కాంప్‌లను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ముఖ్యమంత్రి జగన్ వైపే జనం



ఏఆర్ రొప్పంలో గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిరరూరల్: పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే అందించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా నిలుస్తామని ప్రజలు చెబుతున్నారని ఎమ్మెల్యే తిప్పేస్వామి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఏఆర్ రొప్పంలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే తిప్పేస్వామి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూ లబ్ధి పొందిన వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్సీ కాలనీ వాసులకు కమ్యూనిటీ భవన సౌకర్యం కల్పిస్తామన్నారు. వైఎస్ జగన్ సీఎంగా ఉంటేనే సక్రమంగా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. గ్రామంలో ప్రజలు తెలియజేసిన చిన్న చిన్న సమస్యలకు వెంటనే పరిష్కారం చూపాలని ఉద్యోగులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ కవిత, సర్పంచ్ గీత, జెడ్పీటీసీ సరోజమ్మ, సింగల్ విండో అధ్యక్షుడు రామిరెడ్డి, వైస్ ఎంపీపీలు ఎస్ఎన్ మూర్తి, శ్రీరామరెడ్డి, ఎంపీటీసీ కామరాజు, మాజీ ఎంపీపీ బజ్జప్ప, నాయకులు వేణుప్రకాష్, సత్యనారాయణ, మంజునాథ్, జమ్మానిపల్లి మూర్తి, రంగనాథ్, నర్సేగౌడు, కృష్ణ, క్రిష్టప్ప, హనుమంతరాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్ల సంబరం

మడకశిరరూరల్: ముఖ్యమంత్రి జగనన్న సంక్షేమ పాలనకు రానున్న ఎన్నికల్లో ప్రజలు పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే తిప్పేస్వామి పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తి అయిన సందర్భంగా మంగళవారం ఏఆర్ రొప్పంలో ప్రజాప్రతినిధులు, నాయకులు ఎమ్మెల్యే తిప్పేస్వామికి స్వీట్లు తినిపించి సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకుంటామని ప్రజలు చెబుతుండటం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేసి అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందారన్నారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులు, సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శకంగా నిలుస్తున్నాయని కొనియాడారు.

రొళ్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మండల కేంద్రం బస్టాండ్ ఆవరణలో ఉన్న మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్‌కట్ చేసి స్వీట్లను పంచి పెట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు లోకేష్, శ్రీనివాస్, బసవరాజు, జేసీఎస్ కన్వీనర్ నాగేంద్ర, రవికుమార్, యర్ర గుంటప్ప, ముద్దారెడ్డి, మహంతేష్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు నిర్లక్ష్య ధోరణి వీడాలి



మండల మీట్‌లో మాట్లాడుతున్న ఎంపీపీ చంద్రశేఖర్

రొద్దం: 'సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న కొందరు అధికారులు నిర్లక్ష్య ధోరణితో పనిస్తున్నారు.. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేవిధంగా వ్యవహరిస్తున్నారు.. ఇప్పటికైనా వారు నిర్లక్ష్య ధోరణి వీడాలి' అని ఎంపీపీ చంద్రశేఖర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐకేపీ సమావేశ భవనంలో ఎంపీపీ చంద్రశేఖర్ అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీఎం జగన్ రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, అయితే సచివాలయాల్లో కొందరు అధికారులు సక్రమంగా విధులు నిర్వహించడం లేదన్నారు. రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. అర్హులైన ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందివ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. మండల ప్రత్యేక అధికారి నరసయ్య మాట్లాడుతూ మండలస్థాయి అధికారులు ప్రజా సమస్యలపై స్పందించి పరిష్కరించాలన్నారు. ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్, వైద్యాధికారి జగదీశ్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

పూడికతీతతో భూగర్భజలాల పెరుగుదల



హొట్టేబెట్ట పంచాయతీలో పూడికతీత పనులను పరిశీలిస్తున్న అధికారులు

రొళ్ల: పూడికతీత పనులతో వర్షపు నీళ్లు నిల్వ ఉండి భూగర్భజలాలు పెరుగుతాయని ఉపాధి హామీ పథకం అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జయసింహ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కొడగార్లగుట్ట కాలనీ సమీపంలోని బసవన్నకొండ ఆనుకొని ఉన్న నాయకనకట్టలో అమృత్ సరోవర్ కింద చేపట్టిన పూడికతీత పనులను ఎంపీడీఓ రామారావుతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీడీ జయసింహ రూ.6.70 లక్షల వ్యయంతో పూడికతీత పనులు చేపట్టామని, ఇప్పటి దాకా రూ.5.20 లక్షలు ఖర్చు చేశామన్నారు. ఈ నెలాఖరులోపు పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీఓ నాగరాజు, ఉపాధి సిబ్బంది, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సప్పలమ్మ జాతర



జ్యోతులను మోస్తున్న మహిళలు

హిందూపురం: మండలంలోని చౌళూరు పంచాయతీలోని వెంకటాపురంలో మంగళవారం గ్రామ దేవతలు సప్పలమ్మ, ముత్యాలమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తిశ్రద్ధలతో మహిళలతో జ్యోతులను తలపై పెట్టుకొని ఆలయం వద్ద పూజల అనంతరం అమ్మవార్లకు సమర్పించారు. అమ్మవారి ఉత్సవ మూర్తులను పల్లకీలో ఊరేగించారు.

గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు

హిందూపురం టౌన్: పట్టణంలోని ఆర్టీసీ డిపో నుంచి జూన్ 4న పౌర్ణమి సందర్భంగా అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. జూన్ 3న సాయంత్రం 5 గంటలకు స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి బయలుదేరి జూన్ 4న ఉదయం 3 గంటలకు అరుణాచలం చేరుతుందన్నారు. గిరి ప్రదక్షిణ తర్వాత మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరి శ్రీపురం గోల్డెన్ టెంపుల్, కాణిపాకం సిద్ధివినాయకున్ని దర్శించుకుని మరుసటి రోజు 4 గంటలకు బస్సు హిందూపురం చేరుతుందన్నారు. టికెట్ ధర ఒక్కొక్కరికి రూ.1320 (రిజర్వేషన్‌తో కలిపి) ఉంటుందన్నారు. వివరాలకు సెల్ నంబర్ 7382861308ను సంప్రదించాలని సూచించారు.

జోరుగా పంట రుణాల రెన్యూవల్స్

లేపాక్షి: మండలంలోని స్థానిక ఆంధ్రప్రగతి గ్రామీణా బ్యాంకు, కంచిసముద్రంలోని కెనరా బ్యాంకులో వివిధ పంటలపై తీసుకున్న రుణాల రెన్యూవల్స్ వేగవంతంగా జరుగుతున్నాయి. ఏపీజీబీలో 2300 మంది రైతులు పంటలపై రుణాలు తీసుకోగా ఇప్పటి వరకు 700 మంది రైతులు రెన్యూవల్స్ చేసుకున్నారని బ్రాంచి మేనేజర్ జబీవుల్లాఖాన్ పేర్కొన్నారు. అదేవిధంగా కెనరా బ్యాంకులో కూడా రైతులు రుణాలు రెన్యూవల్స్ చేసుకోవడంలో నిమగ్నమయ్యారు.